

విద్యుత్‌శాఖ ఎస్‌ఈల నియామకం

కల్లూరు, అక్టోబరు 9: కర్నూలు, నంద్యాల జిల్లాల విద్యుత్‌శాఖ ఎస్‌ఈలను నియమిస్తూ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు కర్నూలు విద్యుత్‌శాఖ ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈగా యం.ఉమాపతిని కర్నూలు జిల్లా సర్కిల్లోనే కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నంద్యాల ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈగా తిరుపతి కార్పొరేట్ ఆఫీసు సీఎస్‌ఈ-ఎస్ఎల్‌డీ విభాగంలో జీఎంగా విధులు నిర్వహిస్తున్న జి.సుధాకర్‌కుమార్‌ను నియమిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు.

హంద్రీ - నీవా విస్తరణపై ఆశలు





అసంపూర్తిగా పత్తికొండ జలాశయం

కర్నూలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): 'హంద్రీ-నీవా కాలువ విస్తరణ పనులు చేస్తారా..!' రాయలసీమ కరువు రైతులను వేదిస్తున్న ప్రశ్న. ఏటేటా వేల టీఎంసీలు కృష్ణా జలాలు కడలి పాలవుతు న్నా కరువు రైతుల కన్నీళ్లు తుడవలేని పరిస్థితి. ఈ పరిస్థితి మార్చడానికి రాష్ట్ర విభజన తరువాత అప్పటి సీఎం చంద్రబాబు రూ.1,030 కోట్లతో తొలి దశ కాలువ విస్తరణ పనులు చేపట్టారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పనులకు అవినీతి ముసుగేసి రద్దు చేసింది. మళ్లీ రూ.6,182.19 కోట్లతో టెండర్లు పిలిచారు. పనులు చేస్తే బిల్లులు రావనే భయంతో కాంట్రాక్ట్ దక్కించుకున్న బడా సంస్థలు రెండున్నర ఏళ్లు దాటినా గంపెడు మట్టి కూడా తీయలేదు. మళ్లీ కొలుదీరిన టీడీపీ కూటమి ప్రభుత్వం హంద్రీ-నీవా విస్తరణపై దృష్టి సారించింది. మల్యాల నుంచి కుప్పం వరకు విస్తరించేందుకు రూ.1,920 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. వచ్చే ఏప్రిల్‌లో పనులు మొదలు పెట్టి జూలై ఆఖరులోగా పూర్తి చేసే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల మంత్రి నిమ్మల ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో హంద్రీ-నీవా కాలువ, జలాశయాలను రెండు రోజులు పరిశీలించడంతో విస్తరణపై ఆశలు చిగురిస్తున్నాయి.

టీడీపీ హయాంలో విస్తరణకు శ్రీకారం

రైతుల కన్నీటి' కష్టాలు తీరుతాయనే ఆశయంతో గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం చంద్రబాబు రూ.1,030 కోట్లతో కాలువ విస్తరణ పనులను నాలుగు ప్యాకేజీలుగా మొదలు పెట్టి రూ.285.77 కోట్ల పని చేశారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పనులు పూర్తి చేసి ఉంటే ఇప్పటికే విస్తరణ పూర్తయ్యేది. పూర్తిస్థాయి సామర్థ్యంలో కృష్ణా జలాలు తీసుకునే అకాశం ఉండేది. అయితే టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనులు పూర్తి చేస్తే ఆ మంచి పేరు చంద్రబాబు వస్తుందనే రాజకీయ దురుద్దేశంతో 2019 మే నెలలో అధికారం చేట్టిన జగన్ ప్రభుత్వం ఆ పనుల్లో అవినీతి అక్రమాలు జరిగాయంటూ విస్తరణ పనులు రద్దు చేశారు. ఇది సీమ రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది.

- రూ.1,030 కోట్లతో విస్తరణకు 2014లో టీడీపీ శ్రీకారం
- వైసీపీ ప్రభుత్వం వచ్చాక అవినీతి పేరుతో రద్దు
- రూ.6,182.19 కోట్లతో రీ టెండర్లు
- రెండున్నరేళ్లలో గంపెడు మట్టి కూడా తీయలేదు
- మళ్లీ టీడీపీ కూటమి వచ్చాకే విస్తరణపై దృష్టి
- మల్యాల నుంచి కుప్పం వరకు... రూ.1,920 కోట్లతో ప్రణాళిక

సుజల స్రవంతి పథకమిది..

రాయలసీమ కరువు రైతుల జీవనాడి హంద్రీ-నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు ఇవ్వాలన్న లక్ష్యం. శ్రీశైలం జలాశయం ఎగువన నందికొట్కూరు మండలం మాల్యాల నుంచి 40 టీఎంసీలు కృష్ణా వరద జలాలను ఎత్తిపోసి కరువు నేలకు మళ్లించేలా హంద్రీ-నీవా ప్రాజెక్టు చేపట్టారు. తొలి దశ (ఫేజ్-1) కింద కర్నూలు జిల్లా మల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కి.మీలు ప్రధాన కాలువ, 8 ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 3,850 క్యూసెక్కుల ఎత్తి పోసేందుకు వీలుగా హైడ్రాలికల్ పరిక్యులర్స్ ప్రకారం ప్రధాన కాలువ 9.5 మీటర్లు బెడ్ విడ్త్ (కాలువ అడుగు బాగం వెడల్పు)తో నిర్మించాలి. సీసీ లైనింగ్ చేస్తే 12 పంపులు ద్వారా 3,850 క్యూసెక్కులు (ఒక్కొ పంపు ద్వారా 330 క్యూసెక్కులు) లిఫ్ట్ చేసేలా డిజైన్ చేశారు. ప్రస్తుతం 5-6 పంపుల ద్వారా 1,940 క్యూసెక్కులకు మించి ఎత్తిపోసుకోలేని పరిస్థితి. 3,850 క్యూసెక్కులు ఎత్తిపోస్తే ఆరు నెలల్లో ఎంత తక్కువ కాదన్నా 60 టీఎంసీలు తీసుకొని నిల్వ చేస్తే.. కరువు సీమను సస్యశ్యామలం చేయవచ్చు.



పత్తికొండ సమీపంలో హంద్రీ-నీవా ప్రధాన కాలువ దుస్థితి

హంద్రీ-నీవా కాలువను విస్తారమని గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం చేసిందే తప్ప.. రెండున్నర ఏళ్లలో గంపెడు మట్టి కూడా తీయలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల పంప్‌హౌస్ వద్ద అప్రోచ్ చానల్ 4.806 కిలోమీటర్లు సహా ఫేజ్-1 కింద ప్రధాన కాలువ 0/00 నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి వరకు 216.300 కి.మీల వరకు విస్తరణతో పాటు 8 పంపింగ్ స్టేషన్ల దగ్గర అదనంగా 2,450 క్యూసెక్కులు ఎత్తిపోసేందుకు అదనపు పంపులు ఏర్పాటు కోసం రూ.6,182.19 కోట్ల మంజూరు చేస్తూ 2021 సెప్టెంబరు 15న గత వైసీపీ ప్రభుత్వం సాంకేతిక అనుమతులు ఇచ్చింది. ప్యాకేజీ-1 కింద అప్రోచ్ చానల్ 4.806 కి.మీలు, 0/00 నుంచి 88 కి.మీల వరకు కాలువ విస్తరణ, పీఎస్ -1 నుంచి 5 వరకు పంపింగ్ స్టేషన్ల దగ్గర అదనపు పంపులు ఏర్పాటు కోసం రూ.3,278.18 కోట్లు, ప్యాకేజీ-2 కింద 88 కి.మీల నుంచి 216.300 కి.మీల వరకు ప్రధాన కాలువ విస్తరణ, పీఎస్-6 నుంచి 8 (3 లిఫ్టులు) వద్ద అదనపు పంపులు ఏర్పాటుకు రూ.2,904.01 కోట్లతో టెండర్లు పిలిచారు. 36 నెలల్లో పనులు పూర్తి చేస్తామంటూ ప్యాకేజీ-1 హైదరాబాదుకు చెందిన మెగా కంపెనీ 0.112 శాతం తక్కువ (లెస్)కు, ప్యాకేజీ-2 హైదరాబాదుకు చెందిన డీఎస్ఆర్ - వీపీఆర్ జాయింట్


జగన్‌ది టెండర్ల ఆర్భాటమే..

వెంచర్ 0.107 శాతం తక్కువ (లెస్)కు దక్కించుకుని 2021 డిసెంబరు 31న ఒప్పందం చేసుకున్నారు.

పనులు చేస్తే బిల్లులు రావనే భయంతో రెండు సంవత్సరాల తొమ్మిది నెలలు (33 నెలలు) గడిచినా గంపెడు మట్టి కూడా తీయలేదు. విస్తరణపై గత వైసీపీ పాలకులు చిత్తశుద్ధి చూపలేదు. దీంతో హంద్రీ-నీవా కాలువ విస్తరణ ప్రశ్నార్థకంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఫేజ్-2 కింద అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 26 టీఎంసీలు వినియోగించుకుని 4.05 లక్షల ఎకరాకలు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు ఇవ్వాలనే లక్ష్యంగా.. 216.300 నుంచి 565 కి.మీల వరకు... 349 కి.మీలు ప్రధాన కాలువ, శ్రీసత్యసాయి జిల్లాలో గొల్లపల్లి, చెర్లోపల్లి, మారాల జలాశయాలు, అన్నమయ్య జిల్లాలో శ్రీనివాసపురం, చిత్తూరు జల్లాలో అడవిపల్లి జలాశయాలు చేపట్టారు. రూ.5,602.36 కోట్లతో చేపడితే ఇప్పటికే రూ.2,998.63 కోట్లకు పైగా ఖర్చు చేశారు. 53.52 శాతం పనులు చేశారు. గత జగన్ ప్రభుత్వంలో ఒక్క పైసా నిధులు ఇవ్వకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

కూటమి ప్రభుత్వం రాకతో ఆశలు

తుంగభద్ర, కృష్ణాకు ఈ ఏడాది వరద పోటెత్తింది. శ్రీశైలం జలాశయానికి 1,150 టీఎంసీలకు పైగా వరద చేరింది. రాయలసీమ ప్రాజెక్టు ద్వారా వంద టీఎంసీలు కూడా తీసుకోలేని పరిస్థితి. దీనికి ప్రధాన కారణం సరైన కాలువలు, జలాశయాలు లేకపోవడమే. సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం హంద్రీ-నీవా కాలువ విస్తరణపై మళ్లీ దృష్టి సారించింది. గత వైసీపీ ప్రభుత్వం నిర్వహించిన టెండర్లు రద్దు చేసినట్లు సమాచారం. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ప్రభుత్వంలో 3,850 క్యూసెక్కులు తీసుకోవడానికి వీలుగా ఫేజ్-1 కింద 216.30 కి.మీలు ప్రధాన కాలువ విస్తరణ పనులు గత టీడీపీ ప్రభుత్వం రూ.1,030 కోట్లతో చేపట్టి రూ.285.77 కోట్లు ఖర్చు చేసిన విషయం తెలిసిందే. ఈ బ్యాలెన్స్ పనులు, ఫేజ్-2 (రెండో దశ) కింద 349 కి.మీలు ప్రధాన కాలువ విస్తరణకు కలిపి రూ.1,920 కోట్లతో హంద్రీనీవా ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే ఫేజ్-1 ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఫేజ్-2 ప్రతిపాదనలు రెండు రోజుల్లో పంపుతామని ఇంజనీర్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఆరంభం నాటికి టెక్నికల్, పరిపాలన అనుమతులు, టెండర్లు ప్రక్రియ పూర్తి చేసేలా కసరత్తు చేస్తున్నారు.



మల్యాల పంపింగ్ స్టేషన్

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

హంద్రీ-నీవా కాలువ విస్తరణ కోసం ఫేజ్-1 పరిధిలో బ్యాలెన్స్ పనులు రూ.870 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. ఫేజ్-2లో భాగంగా 216.30 కి.మీల నుంచి 565 కి.మీల వరకు విస్తరణకు రూ.1,050 కోట్లతో అంచనాలు సిద్ధం చేశాం. రెండు రోజుల్లో ప్రభుత్వానికి పంపుతాం. వచ్చే ఏప్రిల్‌లో పనులు మొదలు పెట్టి జూలై ఆఖరులోగా పూర్తి చేసేలా ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు వెళ్తోంది. విస్తరణ పనులు పూర్తి చేస్తే నెలకు 10 టీఎంసీలు... ఆరు నెలల్లో 60 టీఎంసీలు తీసుకునే అవకాశం ఉంది. **- నాగరాజు, హంద్రీ-నీవా ప్రాజెక్టు సీఈ, అనంతపురం జిల్లా**

మహానంది క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- ఈవోను కలిసిన ఆర్కిటెక్ నిపుణులు
- అభివృద్ధి పనులపై సర్వే
- కేంద్ర ప్రభుత్వ నిధులతో మహానంది అభివృద్ధి



ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డితో మాస్టర్ ప్లాన్‌పై చర్చిస్తున్న ఆర్కిటెక్ బృందం సభ్యులు

మహానంది, అక్టోబరు 9: మహానంది క్షేత్రం అభివృద్ధిలో భాగంగా బుధవారం హైదరాబాద్‌కు చెందిన ఆర్కిటెక్ బృందం సభ్యులు మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసేందుకు వచ్చారు. దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డితో ఆర్కెటిక్ నిపుణులు మాస్టర్‌ప్లాన్ రూపకల్పనపై చర్చించారు. అనంతరం మహానందీశ్వరుడికి చెందిన 52.40 ఎకరాల స్థలంలోని పలు ప్రదేశాలను బృందం సభ్యులు పరిశీలించారు. రెండు రోజుల పాటు మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా నిర్మించాల్సిన పనులపై పలు పరిసరాలను సర్వే నిర్వహిస్తారు. రాబోయే 20 సంవత్సరాల వరకు క్షేత్రం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశాక కేంద్ర ప్రభుత్వ నిధులతో మహానందిలో భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులకు రూపొందిస్తామని ఆలయ ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్ తెలిపారు. అలాగే దాతలు ముందుకు వచ్చిన నిర్మాణాలను కూడా వారితోనే నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో ఎర్రమల్ల మధు, సిబ్బంది పాల్గొన్నారు.

కాళరాత్రి దేవిగా భ్రామరి





- గజవాహనంపై ఆదిదంపతులు
- శ్రీశైల క్షేత్రంలో కొనసాగుతున్న దసరా ఉత్సవాలు



స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు



నృత్యం చేస్తున్న కళాకారులు



శ్రీశైలం, అక్టోబరు 9: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడో రోజు అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, విశేషకుంకుమార్చనలు, నవావరణా ర్చనలు, జపానుష్ఠానాలు, పారా యణలు, చండీ హోమం, పంచాక్షరి, భ్రామరి, బాలాజపానుష్ఠానాలు, చండీపారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారి పూజలు నిర్వహించారు. స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, రుద్రయాగాంగ జపాలు, రుద్ర పారాయణాలు చేశారు. ఉత్సవాల్లో బాగంగా కుమారి పూజలు జరిపించారు. ఈ కుమారి పూజలలో భాగంగా రెండు సంత్సరాలు నుంచి పది సంవత్సరాలలోపు బాలికకు పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించారు.

దసరా ఉత్సవాల్లో బాగంగా ఏడో రోజు బుధవారం అమ్మవారికి నవదుర్గ అలం కరణలలో ఒకటైన కాళరాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏడో ఏడో రూపమైన ఈ దేవి నల్లటి దేహఛాయతో జుట్టు విరియబోసుకొని పెబొబ్బు నవ్వులతో రౌద్రరూపంలో ఉంటారు. ఈ దేవి చతుర్భుజాలను కలిగి, కుడివైపున అభయహస్తం, వరదముద్రను, ఎడమవైపున ఖడ్గము, లోహకంఠకాన్ని ధరించి ఉంటారు. చూడడానికి ఈ దేవి రౌద్రరూపంలో ఉన్నప్పటికీ ఈమె ఎల్లపుడూ శుభఫలితాలనే ఇస్తుందని, అందుకే ఈ అమ్మవారిని శుభంకరొ అని కూడా పిలుస్తారు. గజవాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులనుజేసి పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. వర్షం కారణంగా గ్రామోత్సవం రద్దు అయింది. పూజా కార్యక్రమాల్లో దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు, ఆలయ అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

నేడు మహా గౌరిగా అమ్మవారు

దసరా మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం భ్రమరాంబికా అమ్మవారు మహాగౌరిగా దర్శనమివ్వనున్నారు. స్వామి అమ్మవార్లకు నంది వాహన సేవ నిర్వహించనున్నారు.

శ్రీశైలానికి స్వల్పంగా వరద

శ్రీశైలం, అక్టోబరు 9: శ్రీశైలం జలాశయానికి బుధవారం వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల నుంచి 20,611 క్యూసెక్కులు, సుకేలుల నుంచి 13,437 క్యూసెక్కులు మొత్తం 34,048 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. బుధవారం సాయంత్రం 6 గంటల సమాయానికి జలాశయానికి 19,180 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 882.10 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 196.3152 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,627 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కులు మొత్తం 65,942 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.



శ్రీశైలం డ్యాం

నేనూ రైతు బిడ్డనే

- తమిళనాడు తరహాలో రోప్ వే ఏర్పాటుకు నిధులు సమకూర్చుస్తా
- కలెక్టర్ రాజకుమారి
- అరటి తోటల పరిశీలన



పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

మహానంది, అక్టోబరు 9: తమది వ్యవసాయ కుటుంబమని, తానూ రైతు బిడ్డనేనని కలెక్టర్ రాజకుమారి అన్నారు. ఈ-క్రాప్ నమోదులో భాగంగా బుధవారం మహానంది మండలం బుక్కాపురం పొలాల్లో ఆదర్శ రైతు పన్నంగి రమణయ్య ప్రకృతి వ్యవసాయంతో సాగు చేస్తున్న అరటి తోటను కలెక్టర్ పరిశీలించారు. సాగు వివరాలను రైతు ద్వారా తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ చిన్నతనంలో తన తండ్రి పొలాలకు తనతో పాటు తన అన్నను కూడా తీసుకొని వెళ్లేవారని గుర్తు చేసుకున్నారు. తోటల్లోని అరటి గెలలను సులభంగా ప్రధాన రహదారికి చేర్చేందుకు రోప్ వే ను తమిళనాడు తరహాలో ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను రైతు రమణయ్య కోరారు. ఇందుకు స్పందించి రోప్‌వేకు తాను నిధులు మంజూరు చేస్తానన్నారు. ముందుగా తమిళనాడులో అరటి రైతులు అవలంభిస్తున్న రోప్ వే విధానాన్ని పరిశీలించాలని ఉద్యావన శాఖాధికారి శ్రీధర్‌ను ఆదేశించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం సాగుకై వ్యవసాయాధికార్లు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి. నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సాగునీటి ఎన్నికలకు సిద్ధం



- మూడు దశల్లో నిర్వహణకు సన్నాహాలు
- 9 ఏళ్ల తర్వాత ఎన్నికలు.. రైతుల హర్షం
- 16 నుంచి ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం
- షెడ్యూల్ జారీ చేసిన ప్రభుత్వం

కర్నూలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు ఎన్నికలు జరపాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 9 ఏళ్ల తర్వాత వీటికి ఎన్నికలు జరుగుతుండటంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. భారీ, మధ్య, చిన్న నీటి పారుదల శాఖ సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర జలవనరుల శాఖ షెడ్యూల్ జారీ చేసింది. ఈ నెల 16న ప్రక్రియ మొదలై నవంబరు 24న ముగుస్తుంది. అదే క్రమంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఓటర్లు (ఆయకట్టు రైతులు) జాబితా తయారీకి సన్నాహాలు చేస్తున్నారు.

కర్నూలు జలవనరుల శాఖ సర్కిల్ పరిధిలో కేసీ కెనాల్, తుంగభద్ర దిగువ కాలువ, రాంపురం చానెల్, గాజులదిన్నె ప్రాజెక్టుతో పాటు కర్నూలు, నంద్యాల మైనర్ ఇరిగేషన్ చెరువులు వస్తాయి. మేజర్ ప్రాజెక్టుల పరిధిలో 144 సాగునీటి సంఘాలు, మీడియం ప్రాజెక్టు పరిధిలో 12 సాగునీటి సంఘాలు, మైనర్ ఇరిగేషన్ (చిన్ననీటి పారుదల) పరిధిలో 151 సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాల పరిధిలో 4,94,950 ఎకరాల ఆయకట్టు ఉంది. అలాగే కేసీ కెనాల్ పరిధిలో 14, తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) పరిధిలో 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత 2015-16 ఆర్థిక సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. ఆయా కాలువలు, ప్రాజెక్టుల నిర్వహణ ఆ సంఘాల పర్యవేక్షణలోనే నిర్వహించేవారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో వీటి ఎన్నికలకు గ్రహణం పట్టింది. తమ పార్టీకి చెందిన వాళ్లనే నామినేటెడ్ పద్ధతుల్లో నియమించుకున్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో సీఎం చంద్రబాబు సాగునీటి ఎన్నికలు నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగానే ఇటీవల నిర్వహించిన కేబినెట్‌లో ఆమోదం తెలిపారు. బుధవారం షెడ్యూల్ విడుదల చేశారు.

మూడు దశల్లో ఎన్నికలు

సాగునీటి సంఘాలు..! తొలి దశలో సాగునీటి సంఘాలు (డబ్ల్యూయుఏ) ఎన్నికలు నిర్వహిస్తారు. ఆ సంఘం పరిధిలోని ఆయకట్టు రైతులు (ఓటర్లు) ఆరుగురు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఆ డైరెక్టర్లలో ఒకరిని అధ్యక్షుడు, మరొకరిని ఉపాధ్యక్షుడుగా ఎన్నుకుంటారు. ఈ ప్రక్రియ ఈ నెల 16వ తేదీ నుంచి 29వ తేదీ వరకు కొనసాగుతుంది. నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, ఓటర్ల జాబితా గుర్తింపు, అభ్యంతరాల పరిష్కారం, ప్రాదేశిక నియోజకవర్గాల గుర్తింపు వంటివి ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికలు నిర్వహిస్తారు.

డిస్ట్రిబ్యూటరీ కమిటీ: రెండో దశలో సాగునీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీ పాలకవర్గాన్ని ఎన్నుకుంటారు. ఈ ప్రక్రియ ఈ నెల 30వ తేదీన మొదలవుతుంది. నవంబరు 15వ తేదీ వరకు కొనసాగుతుంది.

ప్రాజెక్టు కమిటీ : మూడో దశలో ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు నిర్వహిస్తారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలోని అధ్యక్షులు ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఈ ప్రక్రియ ఈ నెల 15న మొదలై నవంబరు 24వ తేదీన ముగుస్తుంది.

40 రోజుల ప్రక్రియ

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ ప్రక్రియ 16వ తేదీన మొదలై నవంబరు 24వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముగుస్తుంది. ఇందులో ఆయా ప్రాజెక్టుల ఇంజనీర్లతో పాటు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్డీవో, సబ్ కలెక్టర్లు కీలక భూమిక పోషిస్తారు. ఎన్నికల నిర్వహణ కలెక్టర్ రంజిత్ బాషా పర్యవేక్షణలో జరుగుతాయి.

రైతుల్లో హర్షం

ప్రాజెక్టులు, కాల్వల నిర్వహణ ఈ కమిటీల ఆధ్వర్యంలోనే కొనసాగుతాయి. పూడికతీత, పంట కాలువల ఆధునికీకరణ, ప్రధాన కాలువల మరమ్మతులు తదితర పనులు రైతుల భాగస్వామ్యంతోనే నిర్వహిస్తారు. 9 ఏళ్ల తర్వాత ఎన్నికలు నిర్వహిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్టుల వారీగా సాగునీటి సంఘాల వివరాలు

ప్రాజెక్టు	ఆయకట్టు	నీటి సంఘాలు	డిస్ట్రిబ్యూటరీలు	ప్రాజెక్టులు
కేసీ కెనాల్	2,65,624	86	14	01
టీబీపీ-ఎల్లెల్సీ	1,51,134	58	10	01
గాజులదిన్నె	25,435	12	-	-
రాంపురం చానెల్	1,378	01	-	-
ఎంఐ-కర్నూలు	21,623	47	-	-
ఎంఐ-నంద్యాల	29,756	80	-	-
మొత్తం	4,94,950	284	24	02

మంత్రాలయంలో తమిళనాడు హైకోర్టు జడ్జి



మంచాలమ్మకు పూజలు చేస్తున్న జడ్జి జస్టిస్ ధన్‌బాల్

మంత్రాలయం, అక్టోబరు 9: తమిళనాడు హైకోర్టు జడ్జి జస్టిస్ ధన్‌బాల్ బుధవారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహ మూర్తి స్వాగతం పలికారు. తహసీల్దార్ రవి, మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజాచార్, జయతీర్థ ఆచార్, వీఆర్వో భీముడు పాల్గొన్నారు.

పత్తి క్వింటం గరిష్ఠ ధర రూ.7,699

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 9 : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు బుధవారం తెల్ల బంగారంతో కళకళలాడింది. దసరా పండగ సమీపిస్తుండడం రైతులు పత్తి దిగుబడులను విక్రయానికి భారీగా తీసుకొచ్చారు. ప్రస్తుతం కురిసిన వర్షానికి దిగుబడి తగ్గిందని, పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగాయని, క్వింటాలు పత్తి రూ.10వేలు ధర లభిస్తే తప్ప గిట్టుబాటు కాదని రైతులు అంటున్నారు. పండుగ తర్వాత ధరల్లో కదిలిక వచ్చే అవకాశం ఉందని వ్యాపారులు అభిప్రాయపడ్డారు. మార్కెట్ యార్డుకు 12,230 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.4,306, గరిష్ఠ ధర రూ.7,699, మధ్యస్థ ధర రూ.7429 పలికింది.

వ్యక్తి ఆత్మహత్య

నంద్యాల క్రైం, అక్టోబరు 9 : నంద్యాల మండలం రైతునగరం సమీపంలోని శిల్పానగర్‌కు చెందిన సురేష్‌రెడ్డి (35) అనే వ్యక్తి బుధవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి సురేష్‌రెడ్డిని నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా పోలీసులకు తెలిపారు.

భర్త వేధింపులు తాళలేక మహిళ..

బనగానపల్లె , అక్టోబరు 9: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బనగానపల్లె మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిల్లెళ్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మలమడుగుకు చెందిన శకుంతల (40)ను 17 ఏళ్లక్రితం జిల్లెళ్ల గ్రామానికి చెందిన బలరాముడు అనే వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారన్నారు. నాటి నుంచి ఆమెను శారీరకంగా, మానసికంగా హింసించేవాడు. దాంతో మనస్తాపం చెందిన ఆమె ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. శకుంతల సోదరుడు కన్నె సుధాకర్ ఫిర్యాదు మేరకు బలరాముడుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సాయికేశవ (ఫైల్)

పత్తికొండ, అక్టోబరు 9 : మంచి చదువులు చదివి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరాడు. దసరా పండుగను కుటుంబంతో జరుపుకోవాలని గ్రామానికి వచ్చాడు. కంపెనీ నుంచి ఫోన్ రావడంతో మోటార్ సైకిల్‌పై బెంగళూరుకు వెళ్తూ పత్తికొండ సమీపంలో రోడ్డుప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. ఆలూరు మండలం పెద్దహోతూరు గ్రామానికి చెందిన నాప గోవిందరాజులు, జయమ్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒకకుమారుడు సంతానం. కుమారుడు సాయికేశవ బీటెక్ పూర్తిచేసి బెంగళూరులో ఎల్‌టీఐ మైండ్‌ట్రీలో సాఫ్ట్‌వేర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. దసరా పండుగను గ్రామంలో కుటుంబంతో జరుపుకోవాలని మోటార్ సైకిల్‌పై కొద్దిరోజుల క్రితం పెద్దహోతూరుకు వచ్చాడు. కంపెనీ నుంచి ఫోన్‌రావడంతో పని చూసుకోని మళ్లీవస్తానని కుటుంబసభ్యులతో చెప్పి బుధవారం ఉదయం మోటార్‌సైకిల్‌పై బెంగళూరుకు బయలుదేరాడు. పత్తికొండ శివారులో గుత్తి రహదారిలో జగనన్నకాలనీ సమీపంలోని మలుపు వద్ద తమిళనాడు నుంచి ఆదోనివైపు వెళ్తున్న లారీ మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. దాంతో సాయికేశవ తలపై లారీటైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పత్తికొండ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ నిధుల అవినీతిపై కొనసాగుతున్న విచారణ

ఓర్వకల్లు, అక్టోబరు 9: కాల్వబుగ్గ రామేశ్వరస్వామి దేవస్థానం నిధుల అవినీతిపై రెండో రోజు బుధవారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో విచారణ జరిగింది. ఆయనతో పాటు అధికారులు రికార్డులను పరిశీలించారు. మాజీ ఈవో బీఆర్‌కేవీ ప్రసాద్ హుశేనాపురం రాయలసీమ ప్రగతి బ్యాంకులో తన సొంత అకౌంటు ఓపెన్ చేయలేదని దేవదాయ శాఖ మీదనే అకౌంటు ఓపెన్ చేశారని, అలాగే ఆ అకౌంటులో డిపాజిట్లు ఉండగా.. ఆ డిపాజిట్‌లో ఉన్న రూ.130 కోట్లు నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది.

టెట్‌కు 304 మంది అభ్యర్థులు గైర్హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్), అక్టోబరు 9: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) బుధవారం జరిగిన పరీక్షకు 304 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈవో శామ్యూల్ తెలిపారు. బుధవారం ఉదయం, మధ్యాహ్నం జరిగిన రెండు సెషన్లకు 3224 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ఇందులో 2920 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. 304 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు మొత్తం 1613 మందికి గాను, 1472 మంది హాజరు కాగా, 139 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన టెట్ పరీక్షకు 1613 మందికి గాను 1448 మంది అభ్యర్థులు హాజరు కాగా, 165 మంది గైర్హాజరయ్యారు. ఇన్‌చార్జి డీఈవో ఏడీ-2 శ్రీనివాసులు డిపార్టుమెంటల్ ఆఫీసర్ల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పరీక్ష నిర్వాహకులకు సూచనలు చేశారు.

ఏపీ నర్సింగ్ అసోసియేషన్‌కు ఎన్నికలు

- ఎన్నికల అధికారిగా బి. చెన్నమ్మ
- నాలుగేళ్ల తర్వాత ఎన్నికలు
- ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన అధికారి



మాట్లాడుతున్న చెన్నమ్మ

కర్నూలు(హస్పిటల్), అక్టోబరు 9: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏపీ గవర్నమెంటు నర్సింగ్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరగనున్నాయి. నాలుగేళ్ల తర్వాత ఉమ్మడి 13 జిల్లాలో ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం వీటి నిర్వహణ బాధ్యతలను కో-ఆపరేటివ్ విభాగానికి అప్పగించింది. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాకు జిల్లా కో-ఆపరేటివ్ ఆడిట్ ఆఫీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి. చెన్నమ్మను నియమించింది. ఈ మేరకు మంగళవారం నర్సెస్ అసోసియేషన్ ఎన్నికల అధికారిగా కర్నూలు జీజీహెచ్ రేడియాలజీ విభాగంలో బాధ్యతలు చేపట్టింది. ఈ మేరకు ఆమె ఎన్నికల షెడ్యూల్ వివరాలను విడుదల చేశారు.

● **షెడ్యూల్ ఇలా:** రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నర్సింగ్ సిబ్బంది ఓటరు లిస్టును ప్రకటించినట్లు ఎన్నికల అధికారి బి. చెన్నమ్మ తెలిపారు. 321 మంది ఓటర్లు లిస్టును కర్నూలు జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ ఆఫీసు, డీఎంహెచ్‌వో కార్యాలయం, రేడియాలజీ విభాగం ఎన్నికల అధికారి ఆఫీసు వద్ద నోటీసు బోర్డులో అతికించినట్లు తెలిపారు. ఈ నెల 13వ తేదీలోపు అభ్యంతరాలను రిటర్న్‌గా రాసి ఇవ్వాలని, 14వ తేదీ ఫైనల్ ఓటరు లిస్టును ప్రకటిస్తామన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో 16వ తేదీ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని, 17న పరిశీలన, 18వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఉపసంహరణ ఉంటుందన్నారు. ఈ నెల 23న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కర్నూలు జీజీహెచ్ ఓల్డ్ సీఎల్‌జీలో పోలింగ్ జరుగుతుందన్నారు. అదే రోజు కౌంటింగ్ సాయంత్రం 5 గంటలకు ఉంటుందన్నారు. 5 సంవత్సరాలు 1200 సభ్యత్వం కట్టిన నర్సింగ్ సిబ్బంది ఎన్నికల్లో పోటీ చేయడానికి 3 సంవత్సరాలు రూ.720లు సభ్యత్వం కట్టిన వారు అర్హులని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ

కర్నూలు(ఎడ్యుకేషన్), అక్టోబరు 9: రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె. రంగలక్ష్మీదేవి బుధవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన శిక్షణ సంస్థల్లో కోచింగ్ ఇప్పిస్తున్నట్లు ఆమె వివరించారు. శిక్షణ సంస్థల వివరాలను ఆన్‌లైన్‌లో డైన్‌లోడ్ చేసుకొని ఈ నెల 21వ తేదీలోగా నిరుద్యోగ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రూ.45 లక్షలతో బీసీ హాస్టళ్లలో మరమ్మతులు

కర్నూలు(ఎడ్యుకేషన్), అక్టోబరు 9: జిల్లాలోని బీసీ వసతి గృహాల్లో అత్యవసర మరమ్మతుల పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి పి. వెంకటలక్ష్మమ్మ బుధవారం తెలిపారు. స్వంత భవనాలు ఉన్న వసతి గృహాల్లో పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఒక్కొక్క హాస్టల్ భవనానికి రూ.1.50 లక్షల చొప్పున 30 హాస్టళ్ళకు రూ.45 లక్షలు వ్యయం చేయనున్నట్లు తెలిపారు.

నేడు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 9: జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాలోని తపాలా కార్యాలయాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పత్తికొండ, డోన్, ఎమ్మిగనూరు కార్యాలయాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఆధార్ ప్రత్యేక కేంద్రం అందుబాటులో ఉంటుందన్నారు. కేంద్రాల్లో సవరణలు, కొత్తగా నమోదు, ఫోన్ నెంబరు లింక్, పేర్లు చిరునామాల మార్పులు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మెప్మాలో విధుల కేటాయింపు

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 9: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) విభాగంలో ఇటీవల సీఎంఎం, టీఎంసీ, సీఓలకు బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఇతర మున్సిపాలిటీల నుంచి మెప్మాకు వారికి విధులను కేటాయిస్తూ మెప్మా పీడీ నాగశివలీల బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 363 ఎస్ఎల్ఎఫ్‌లకు పర్యవేక్షణ చేయాలని 17 మందిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మద్యం దుకాణాలకు 11 వరకు దరఖాస్తులు

కర్నూలు(అర్బన్), అక్టోబరు 9: మద్యం దుకాణాలకు ఈనెల 11 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని జిల్లా అబ్కారీ, మద్య నిషేధ అధికారి మచ్చా సుధీర్ బాబు తెలిపారు. జిల్లాలో 99 మద్యం దుకాణాలకు సంబంధించి 11తేదీ రాత్రి 7 గంటల వరకు దరఖాస్తు స్వీకరించి, 14న జడ్పీ మీటింగ్ హాలులో లక్కీడిప్ ద్వారా దుకాణాలను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రానికి 2053 దరఖాస్తులు వచ్చాయని, కర్నూలు-955, కోడుమూరు-349, ఆదోని-181, ఆలూరు-151, పత్తికొండ-199, ఎమ్మిగనూరు-182, కోస్గి -36 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

మానసిక కల్లోలం

- పెరుగుతున్న మనో వ్యాధులు
- జిల్లాలో 30 శాతం మంది మానసిక రోగులు
- నేడు మానసిక ఆరోగ్య దినోత్సవం



కర్నూలు(హస్పిటల్), అక్టోబరు 9: శరీరానికి జబ్బులు వచ్చినట్లే.. మనస్సుకు కూడా జబ్బులు వస్తాయి. మన దేశంలో శారీరక ఆరోగ్యంపై చూపించిన శ్రద్ధ మానసిక ఆరోగ్యంపై చూపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా రోజుకు సుమారు 12వేల మంది వివిధ వ్యాధులతో ఆసుపత్రులకు వస్తుండగా.. వారిలో 30 శాతం మంది మానసిక వ్యాధులతో బాధపడుతున్నారు. ప్రజల్లో మానసిక ఆరోగ్యంపై అవాహన కల్పించేందుకు ఏటా అక్టోబరు 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినాన్ని నిర్వహిస్తున్నారు. భారతదేశంలో పది శాతం మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. కొవిడ్ అనంతరం ఈ పరిస్థితి మరింత పెరిగినట్లు డబ్ల్యూహెచ్‌వో వెల్లడించింది. ఇండియాలో 13 నుంచి 17 ఏళ్ల బాలల్లో 7.3 శాతం మానసిక ఆందోళన, ఒత్తిడి, మాదకద్రవ్యాల వినియోగం, ఆత్మహత్య ఆలోచనలతో బాధపడుతున్నారు.

మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యం



పని చేసే చోట మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. శారీరక ఆరోగ్యం కన్నా మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యం. కానీ ప్రజలకు దీనిపైన సరైన అవగాహన లేదు. ఆధునిక జీవన విధానం, నిద్రలేమి, ఒత్తిడి, జన్యులోపాల వల్ల ఈ జబ్బులు అధికంగా వస్తున్నాయి. ఇటీవల టెలిమానస్ ద్వారా మానసిక రోగులు టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్ చేసి సమస్యను వివరించవచ్చు.

- డా. నాగేశ్వరరావు, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, మానసిక ఆరోగ్య విభాగం, కర్నూలు జీజీహెచ్

సోషల్ మీడియాకు బానిస కావొద్దు



ఈ డిజిటల్ యుగంలో యువత ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్యూబ్స్ టెలిగ్రామ్, వాట్సాప్ తదితర సోషల్ మీడియాకు బానిసలుగా మారుతున్నారు. తద్వారా మానవ సంబంధ బాంధవ్యాల రాహిత్య సమస్యలలో చిక్కుకుపోతున్నారు. మానసిక అనారోగ్యాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, సెల్‌ఫోన్ వ్యసనం వంటి వాటికి దూరంగా ఉండాలి.

- డా.బి. రమేష్‌బాబు, సీనియర్ మానసిక వైద్యనిపుణుడు, మానస హాస్పిటల్, కర్నూలు

మానసిక వ్యాధులను త్వరగా గుర్తించాలి



మానసిక వ్యాధులను సరైన సమయంలో గుర్తించి వైద్యులతో చికిత్స తీసుకోవాలి. లేకపోతే మరింత ప్రమాదం ఏర్పడుతుంది. మానసికంగా ఆరోగ్యం ఉండాలంటే ఇష్టమైన పనులు చేయడం, బాధలను కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకోవాలి. ఉదయం వాకింగ్, ధ్యానం, యోగా చేయాలి.

- డా.కే. నాగిరెడ్డి, నరాలు, మానసిక వ్యాధుల నిపుణుడు, ఆశా కిరణ్ హాస్పిటల్, కర్నూలు

కొవిడ్ తర్వాత ఎక్కువయ్యాయి



కొవిడ్ తర్వాత మానసిక జబ్బులు ఎక్కువయ్యాయి. ప్రతి చిన్నదానికి భయపడటం, లేనిది ఉన్నట్లు భయపడటం, ఒత్తిడి, జబ్బు లేకున్నా ఎక్కువ పరీక్షలు చేసుకోవడం ఎక్కువయ్యాయి. మెదడులో రసాయనాల మార్పుల వల్ల మానసిక వ్యాధులు వస్తాయి. ఈ వ్యాధులను త్వరగా గుర్తించి చికిత్స చేసుకోవాలి.

- డా.కె. హరిప్రసాద్, మానసిక వ్యాధుల నిపుణుడు, మౌర్య హాస్పిటల్, హరి న్యూరోమైండ్ క్లినిక్, కర్నూలు

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి
- సాగు నీటి సంఘాల ఎన్నికలపై కూటమి నాయకులతో సమీక్ష



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), అక్టోబరు 9: సాగు నీటి సంఘాల ఎన్నికల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి కోరారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సమష్టిగా సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన వెలువడినందున ఉమ్మడి జిల్లాలోని కేసీ కెనాల్, తుంగభద్ర, ఎల్ఎల్‌సీ, హంద్రీ నీవా వంటి నీటి సంఘాలకు కూడా ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలుపుకు నాంది పలకాలని, గతంలో జడ్పీటీసీ స్థానాల్లో మొత్తం మూడోవంతుల మెజార్టీ సీట్లలో గెలుచుకోవడం జరిగిందని, అదేవిధంగా ప్రస్తుతం కూడా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవంగా గెలుచుకుని చరిత్రను పునరావృతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి చూసి ఇప్పటికే గ్రామాల్లో తెలుగుదేశం పార్టీలో చేరికలు మొదలయ్యాయని, త్వరలో ఆదోనిలో నిర్వహించనున్న కార్తీక వనమహోత్సవానికి గౌడ సోదరులు పదివేల మంది హాజరయ్యేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గం నుంచి కొన్ని గ్రామాలకు చెందిన గౌడ సోదరులు తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు. సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు సురేష్, నంద్యాల నాగేంద్ర, కేఈ జగదీష్ , ఎల్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో చైన్ స్నాచింగ్

కర్నూలు, అక్టోబరు 9: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో హౌసింగ్ బోర్డు కాలనీలో నాగలక్ష్మి అనే మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు గొలుసును అపహరించారు. బుధవారం ఉదయం మహిళ తన ఇంటి ముందు శుభ్రం చేసుకుంటుండగా.. ఇద్దరు ఆగంతకులు జర్కిన్ వేసుకుని తలకు హెల్మెట్ పెట్టుకుని నెంబరు లేని మోటారు సైకిల్‌పై వచ్చారు. ఆమె తన పనుల్లో నిమగ్నమై ఉండగా.. ఆమె మెడలోని నుంచి గొలుసును తెంపుకుని ఉడాయించారు. బాధితురాలు కేకలు వేసినా ఇద్దరు దొంగలు అప్పటికే పరారయ్యారు. అపహరణకు గురైన గొలుసు విలువ రెండున్నర తులాలు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలాం జాతీయ ప్రతిభా పురస్కారానికి మండి అన్వర్ హుసేన్ ఎంపిక

కర్నూలు(అర్బన్), అక్టోబరు 9: ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారానికి ఉస్మానియా కళాశాల తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ మండి అన్వర్ హుసేన్ ఎంపికయ్యారు. ఎస్‌పీఎల్‌టీ గౌరవ అధ్యక్షుడు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు, అధ్యక్షుడు పి. నాగయ్య ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న కలాం జయంతిని పురస్కరించుకుని దక్షిణ భారత దేశంలో ప్రతిభ కనపరిచిన ఉపాధ్యాయులు, అధ్యాపకులను జాతీయ అవార్డుకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఈనెల 20న గుంటూరులో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఎంపికైన వారికి అవార్డులు ప్రదానం చేస్తారని తెలిపారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

ఆదోని, అక్టోబరు 9: పోక్సో కేసులో యువకుడిని అరెస్టు చేసినట్లు సీఐ సూర్యమోహన్ రావు తెలిపారు. ఆదోని పట్టణానికి చెందిన బాలికను సెప్టెంబరు 29వ తేదీన డోన్ పట్టణానికి చెందిన కృష్ణ అనే వ్యక్తి మాయ మాటలు చెప్పి బాలికన తీసుకెళ్లాడని బాలిక తల్లి ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం కేసు నమోదు చేసిన పోలీసులు ఎట్టకేలకు బుధవారం యువకుడిని అరెస్టు చేశారు. దీంతో ఆ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకుతో కృష్ణపై పోక్సో కింద కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నట్లు తెలిపారు

సీడీఆర్ బాండ్లపై విజిలెన్స్ విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 9: నగర పాలక సంస్థ పరిధిలో సీడీఆర్ బాండ్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేప ట్టింది. ఈ మేరకు ఇటీవల సీడీఆర్ బాండ్లపై జరిగిన 135 బాండ్ల విషయంలో ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చింది. ఈ క్రమంలో స్పందించిన విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి నగర పాలక సంస్థ కమిషనర్‌కు సీడీఆర్ బాండ్లకు సంబంధించి వివరాలు అందజేయాలని లేఖ రాశారు.

నేడు ఆర్‌యూకు సెలవు

కర్నూలు(అర్బన్), అక్టోబరు 9: దసరా పండుగను పురస్కరిం చుకొని రాయలసీమ యూనివర్సిటీలోని బోధనేతర సిబ్బందిని ఈనెల 10న సెలవు దినంగా ప్రకటించినట్లు ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ విద్యా ర్థులకు 7వ తేదీ నుంచి 13 వరకు సెలవులు ప్రకటించిన విషయం విధితమే. ఈ క్రమంలో బోధనేతర సిబ్బందికి ఒక రోజు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

జాతీయ క్రికెట్ పోటీలకు శాంతిరాం విద్యార్థి ఎంపిక


ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం

పాణ్యం, అక్టోబరు 9 : జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన సీఎస్ఈ విద్యార్థి యం. కలాం ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన నెల్లూరు ఆదిశంకరా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయ సౌత్‌జోన్ యూనివర్శిటీ క్రీడల జట్టు ఎంపికలో జెఎన్‌టీయూఏ క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. డిసెంబరులో చెన్నై లోని మద్రాస్ యూనివర్శిటీలో జరిగే జాతీయ సౌత్ జోన్ యూనివర్శిటీ క్రీడల్లో విద్యార్థిని పాల్గొంటాడన్నారు. విద్యార్థిని కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు, ఎండీ శివరాం, డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, పీడీ చంద్రారెడ్డి అభినందించారు.

సిటిజన్ బోర్డులు ఏర్పాటు చేయాలి

పాణ్యం, అక్టోబరు 9 : పల్లె పండుగ కార్యక్రమంలో సిటిజన్ బోర్డులు ఏర్పాటు చేయాలని డ్వామా పీడీ జనార్ధనరావు ఆదేశించారు. బుధవారం పల్లెపండుగ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 50 రోజులు దాటిన ప్రతి ఉపాధి కూలీకి పని కల్పించాలన్నారు. ప్లానింగ్ ప్రాసెస్‌లో పనుల గుర్తింపును వేగవంతం చేయాలని తెలిపారు. సిటిజన్ మ్యాప్, సోషల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్‌లను గ్రామ పంచాయతీ వారిగా తయారు చేసి గ్రామస్థులను భాగస్వామ్యం చేసి పనులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ విజయరాణి, ఈసీ శివారెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

మహానంది, అక్టోబరు 9: మండలంలోని మసీదుపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బాలనర్సి అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం మహానంది మండల టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి పరామర్శించి, చికిత్స కోసం రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

మహానందిలో చిన్నారులకు అక్షరాభ్యాసం


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న వేదపండితులు

మహానంది, అక్టోబరు 9: మహానంది క్షేత్రంలో బుధవారం సరస్వతీ పూజ పురస్కరించుకొని ఆలయ వేదపండితులు చిన్నారులతో అక్షరాభాస్యం చేయించారు. సరస్వతీ దేవికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాల మంటపంలో ఆలయ వేదపండితులు చండూరి రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేపట్టారు.

మహానందిలో డీఎఫ్‌వో పూజలు

మహానంది, అక్టోబరు 9: మహానంది క్షేత్రంలో నంద్యాల డీఎఫ్‌వో నాగ మునీశ్వరి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో దేవి నవరాత్రులను పురస్కరించుకొని అభిషేకార్చనలను నిర్వహించారు. అనంతరం వేదపండితులు శాలువతో సన్మానించి ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ శ్రీనివాసులు, నంద్యాల అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఎఫ్ఎస్‌వో విజయ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా చేగువేరా వర్ధంతి

నందికొట్కూరు, అక్టోబరు 9: పట్టణంలో చేగువేరా 57వ వర్ధంతి పీడీఎస్‌యూ, ఆర్‌పీఎస్ఎఫ్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు నవీన్, శేఖర్ నాయుడు, భవన కార్మికులు వివిధ కార్మికులు సలాం, రాజు, రామ్, వెంకటేష్, రమేష్ ఆచారి పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించండి


దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

నందికొట్కూరు, అక్టోబరు 9: నియోజకవర్గంలో బాలకార్మిక వ్యవస్థను అరికట్టాలని లీగల్ సర్వీస్ చైర్మన్ ఇందిరా ప్రియదర్శిని ఆదేశించారు. బుధవారం నందికొట్కూరు మండల్ లీగల్ సర్వీస్ చైర్మన్ ఇందిరా ప్రియదర్శిని ఆధ్వర్యంలో ఆపరేషన్ స్వేచ్ఛ బాండెడ్ చైల్డ్ లేబర్ కార్యక్రమాన్ని కోర్టు ఆవరణలో నిర్వహించారు. మండల లీగల్ సర్వీస్ చైర్మన్ ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ పట్టణంలోని వివిధ దుకాణాల్లో ఎవరైనా బాల కార్మికులు పని చేస్తుంటే గుర్తించాలని అధికారులకు సూచించారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

బండిఆత్మకూరు, అక్టోబర్ 9: గ్రామాల్లో సచివాలయ సిబ్బంది పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీవో దస్తగిరి సూచించారు. బుధవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో రోడ్డుపై నిలచిఉన్న బురదను పరిశీలించి వెంటనే తొలగించాలని కార్యదర్శికి సూచించారు. అనంతరం సంతజూటూరులోని ప్రధాన రహదారిలో నిలచిఉన్న చెత్త చెదారాలను పరిశీలించి తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ రామచంద్రుడు, కార్యదర్శులు వెంకట చౌడయ్య, శేషకుమారి

మద్యం షాపుల దరఖాస్తులకు గడువు పెంపు

నంద్యాల క్రైం, అక్టోబరు 9 : ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం షాపుల దరఖాస్తుల ప్రక్రియను రెండురోజులు పొడిగించినట్లు నంద్యాల ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి బుధవారం తెలిపారు. ప్రభుత్వం పేర్కొన్న ప్రకారం 9వ తేదీ సాయంత్రం 5గంటలకు ముగియాల్సిన దరఖాస్తులను ఈ నెల 11వ తేదీ సాయంత్రం 7గంటల వరకు కొనసాగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు నంద్యాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నంద్యాల, నంద్యాల మండలం, బండిఆత్మకూరు, పాణ్యం, మహానంది, గడివేముల మండలాల పరిధిలో మొత్తం 24షాపులకు గాను బుధవారం వరకు 522 దరఖాస్తులు అందినట్లు సీఐ తెలిపారు.

శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలి


సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు


ఆత్మకూరురూరల్, అక్టోబరు 9 : ఆత్మకూరు మండలం కొత్తరామాపురం గ్రామంలో దళితులకు శ్మశాన వాటిక కోసం స్థలం ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఏసురత్నం, మండల కార్యదర్శి నరసింహనాయక్ అన్నారు. బుధవారం కొత్తరామాపురం గ్రామంలో వారు మాట్లాడారు. అంతకు ముందు సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం ఆ గ్రామ సీపీఎం కార్యదర్శిగా పక్కీరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జయపాల్, నాగేశ్వరరావు, సుబ్బరాయుడు, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలేవీ?


నిరుపయోగంగా మారిన ఏపీ గిరిజన గురుకుల పాఠశాల మైదానం

పాణ్యం, అక్టోబరు 9 :

విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. క్రీడా మైదానాలు, క్రీడా పరికరాలు, సిబ్బంది కొరత తదితర సమస్యలు క్రీడాభివృద్ధికి ఆటంకంగా మారాయి. కొన్ని పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నా విద్యార్థులు లేకపోవడం, పీఈటీలు ఉన్నా మైదానాలు లేకపోవడం వంటి సమస్యలు వేధిస్తున్నాయి. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరం. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.


ఏపీ మోడల్ పాఠశాల మైదానం ఇలా..

పాణ్యం మండలంలో 46 ప్రభుత్వ, ఎనిమిది ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 16 ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా మైదానాలు లేవు, జాతీయ స్థాయికి ఎదగాలన్నా విద్యార్థుల ఆశలు అడియాశలుగానే మిగిలిపోతున్నాయి. దేశ ప్రతిభ, పేరు ప్రఖ్యాతులు ఇనుమడింపజేసే క్రీడలను ప్రోత్సహించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వహిస్తుందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. క్రీడా మైదానాలు క్రీడలకు అనువుగా లేవు. కొన్ని పాఠశాలల్లో క్రీడామైదానాలు ఉన్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. అయితే ప్రభుత్వం నిర్వహించే క్రీడలను ప్రైవేటు పాఠశాలల మైదానాల్లో నిర్వహిస్తూ చేతులుదులుపుకుంటున్నారు.

- ఆటస్థలాలు లేనిపాఠశాలలు
- స్థలం ఉన్నా ఆడుకోలేని దుస్థితిలో క్రీడా మైదానాలు
- నిరుపయోగంగా క్రీడా పరికరాలు

క్రీడా పాఠశాలకు మైదానం కరువే..

మండలంలోని బలపనూరు వద్ద గల ఏపీ గిరిజన గురుకుల పాఠశాలలో 2021 ఏప్రిల్ 11న ప్రారంభించిన స్పోర్ట్స్ స్కూల్‌కు మైదాన స్థలం ఉన్నా అభివృద్ధికి నోచుకోలేదు. ఈ పాఠశాలలో అనంతపురం, కర్నూలు, కడప, నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన బాలికల కోసం ఉమ్మడి జిల్లాలోని పాణ్యం మండలం బలపనూరు పరిధిలో ఏర్పాటు చేశారు. క్రీడలపై ఆసక్తి ఉన్న గిరిజన బాలికలు ఈపాఠశాలలో చేరాల్సి ఉంది. కేవలం క్రీడలే లక్ష్యంగా ప్రారంభించిన ఈ పాఠశాలలో దాదాపు 70 మంది బాలికలు చేరాల్సి ఉండగా ప్రస్తుతం 48 మంది ఉన్నారు. ఒక పీడీ, పీఈటీ, హాకీ కోచ్, అథ్లెటిక్ కోచ్, జూడో కోచ్‌లను కేటాయించినా హాకీలో శిక్షణ ఇవ్వడానికి అనువైన మైదానం లేదు. అలాగే అథ్లెటిక్ కోచ్‌కు శిక్షణనివ్వడానికి ప్రభుత్వం అవకాశం కల్పించలేదు. దీంతో డిప్యేషన్‌పై అనంతపురం జిల్లాకు వెళ్లినట్లు తెలిసింది. జూడో కోచ్ మెడికల్ సెలవులో వెళ్లారు. ట్రాక్‌లు లేకపోవడంతో పరుగు పందెం, మైదానం చదును లేక కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ తదితర ఆటలు ఆడలేని పరిస్థితి ఏర్పడింది.

గ్రామీణ ప్రాంతాలలోనూ అదే పరిస్థితి

గ్రామీణ స్థాయి విద్యార్థులకూ మైదానాలు కరువయ్యాయి. వడ్డుగండ్ల, అయ్యపురెడ్డి కాలనీ, కౌలూరు, గోనవరం, గోరుకల్లు, పాణ్యం (మెయిన్), నెరవాడ, తొగర్చేడు, భూపనపాడు ప్రాథమిక పాఠశాల. పాణ్యం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేవు. అలాగే ఏపీ గిరిజన గురుకుల, బీసీ గురుకుల, ఏపి మోడల్, కస్తూరిబా, గోరుకల్లు, తమ్మరాజుపల్లె గ్రామాలలోని ఉన్నత పాఠశాలలకు మైదానాల స్థలాలు ఉన్నా ఆడుకొనే పరిస్థితి లేదు. చెట్లు, ముళ్లపొదలతో నిండి ఆటస్థలాలు నిరుపయోగంగా మారాయి.

నిరుపయోగంగా క్రీడా పరికరాలు : 2021లో ప్రభుత్వం పాఠశాలలకు మంజూరు చేసిన క్రీడా పరికరాలు నిరుపయోగంగా మారాయి. పరికరాలు నాసిరకం కొరవడడంతో మూలన వేసినట్లు తెలుస్తోంది. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంతో చేపట్టిన క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఇచ్చే ప్రైజ్ మనీ ఇప్పటికీ అందలేదని కొందరు క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారుల బ్యాంకు నెంబర్లు తీసుకున్నా అకౌంట్‌లో జమకాలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని క్రీడా పరికరాలు సచివాలయాల్లోనే ఉన్నట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ యువతి మృతి

నంద్యాల క్రైం, అక్టోబరు 9 : ప్రేమ పేరుతో మోసపోయానని మనస్తాపానికి గురైన శశికళ ఈ నెల 6న విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆస్పత్రిలో కోలుకోలేక బుధవారం మృతిచెందింది నంద్యాల పట్టణానికి చెందిన కోటిరెడ్డి ప్రసాద్ అనే యువకుడు, పొన్నాపురానికి చెందిన శశికళ (20)గత రెండేళ్లుగా సన్నిహితంగా ఉండేవారు. శశికళ తిరుపతిలోని పద్మావతి విశ్వవిద్యాలయంలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతోంది. దసరా శెలవులకు ఇంటికి వచ్చింది. ప్రియుడు ప్రసాద్ తనను నిరాకరిస్తుండటంతో మనస్తాపానికి గురై 6వ తేదీ ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబసభ్యులు నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందింది. మృతురాలి తండ్రి చిన్న వెంకటేశ్వర్లు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమార్తెలు. శశికళ మొదటి కూతురు. మృతురాలి తల్లి కాంతాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నంద్యాల తాలుకా ఎస్సై నజీర్ తెలిపారు.

ఆత్మకూరు ఏజీపీగా వేముల వెంకటేశ్వర్లు

ఆత్మకూరు, అక్టోబరు 9: ఆత్మకూరు సీనియర్, జూనియర్ సివిల్ కోర్టులకు సంబంధించి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు సీనియర్, జూనియర్ సివిల్ కోర్టుల ఏజీపీగా తనకు అవకాశం కల్పించడం సంతోషకరంగా ఉందని తెలిపారు. తనపై ఎంతో నమ్మకాన్ని ఉంచి అప్పగించి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని అన్నారు.

ఎలుకలను నివారిస్తేనే పంటలు పదిలం

నంద్యాలరూరల్, అక్టోబరు 9: పంటలలో ఎలుకల నివారణను చేపడితేనే పంటలు దక్కుతాయని నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం నంద్యాల మండలం పోలూరు గ్రామంలో వ్యవసాయ అధికారి ప్రసాదరావ్ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టారు. ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ వరి ప్రధాన పంట కావడంతో ఎలుకల ఉధృతి అధికంగా ఉందన్నారు. ఎలుకల వల్ల పంటలో 5-10 శాతం దిగుబడి తగ్గుతుందని తెలిపారు. రైతులందరూ కలిసి సామూహికంగా ఎలుకలను నివారిస్తేనే ప్రయోజనం కల్గుతుందన్నారు. ఎలుకల నివారణ కోసం వరినూకలు 9.6 కేజీలు, 0.2 లీటర్ల నూనె, 0.2 కేజీల బ్రోమోడయలోన్ మందును కలిపిన ప్యాకెట్లను రైతులకు ఉచితంగా అందజేశారు.

వెలుగోడు: సామూహిక ఎలుకల నివారణ చేపట్టి రైతులు తమ పంటలను కాపాడుకోవాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు అంజనేయ అన్నారు. బుధవారం వెలుగోడు మండలంలోని రేగడగూడూరు గ్రామంలో మండల వ్యవసాయశాఖ అధికారి పవన్ అధ్యక్షతన నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు మాజీ మార్కెట్‌కమిటీ చైర్మెన్ నారాయణరెడ్డి, రైతుసేవాకేంద్రం, సిబ్బంది రైతులు పాల్గొన్నారు..

కాళరాత్రి దుర్గా.. పాహిమాం


మహానందిలో శేషవాహనంపై కాళరాత్రి దుర్గ ఊరేగింపు

మహానంది, అక్టోబరు 9: దసరాదేవి దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం కాళరాత్రి దుర్గ అలంకారంలో కామేశ్వరీ దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అమ్మవారికి అర్చకులు వనిపెంట ప్రకాశంశర్మ, పుల్లూరి జనార్దన్‌శర్మ ప్రత్యేక కుంకుమార్చన పూజలను నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ రెండో ప్రాకారంలో ఏర్పాటు చేసిన యాగశాల మంటపంలో వేద పండితులు, రుత్వికులు భక్తిశ్రద్ధలతో ఉదయం నుంచి సహస్రనామార్చన, వేదపారాయణములు, కలశపూజలు, చండీ హోమాలతో పాటు శ్రీచక్రార్చనలను జరిపారు. సాయంకాలం అమ్మవారికి సహస్రదీపాలంకరణ సేవలను అత్యంత వైభవంగా జరిపారు. రాత్రి 9 గంటలకు శేషవాహనంపై కాళరాత్రి దుర్గను ఆశీనులు గావించారు. ఆలయ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో ఎర్రమల్ల మధు, శానిటేషన్ ఇన్‌చార్జి పసుపుల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ చింతం నాగమణి, టీడీపీ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ యువత కార్యదర్శి క్రాంతికుమార్ యాదవ్ పాల్గొన్నారు.

పంట నమోదులో వాస్తవ సాగుదారులు ఉండాలి


సాగుదారుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల రూరల్, అక్టోబరు 9: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంట నమోదులో వాస్తవ సాగుదారులే ఉండాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. బుధవారం నంద్యాల మండలం కానాల గ్రామంలో మిరప, వరి పంటలను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నమోదులో రైతు వివరాలు, సర్వేనెంబర్, నీటివసతి వంట అంశాలు సరిగా నమోదు చేశారో లేదో ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలన్నారు. పంట నమోదు చేసుకున్న రైతులు అందరికి ఈకేవైసీ చేయించాలన్నారు. బుధవారం చివరి రోజు కావడంతో వందశాతం ఈకేవైసీ పూర్తి చేయాలని రెవెన్యూ, వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నంద్యాల వ్యవసాయ సహయ సంచాలకులు రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావ్, వీఆర్‌వోలు, వీఏఏలు ఉన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే బుడ్డా


జలవనరులశాఖ మంత్రి నిమ్మలను కలిసిన ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, అక్టోబరు 9: రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును బుధవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి నిమ్మలను కలిసి శ్రీశైలం నియోజకవర్గంలోని ఇరిగేషన్‌శాఖకు సంబంధించి పలు విషయాల గురించి చర్చించి నిధుల మంజూరుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకించి సిద్దాపురం ఎత్తిపోతలు, వరదరాజస్వామి ప్రాజెక్ట్ ఆధునీకరణ, వెలుగోడు జలాశయం అభివృద్ధి పనులు, పలు గ్రామాల్లోని చెరువుల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు.

ఏపీ చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్‌గా రవికృష్ణ

నంద్యాల రూరల్, అక్టోబరు 9 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్‌గా నంద్యాలకు చెందిన డా.రవికృష్ణ ఎన్నికయ్యారు. రాష్ట్ర నిర్వాహక కార్యదర్శిగా రామసుబ్బారెడ్డిని ఎంపికచేశారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఆంధ్ర చెస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన రాష్ట్రకార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని బుధవారం డా.రవికృష్ణ తెలిపారు. రాష్ట్రకార్యవర్గంలో నంద్యాల నుంచి ఇద్దరిని ఎన్నుకోవడం ఆనందంగా ఉందన్నారు. నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డా.రవికృష్ణ, కార్యదర్శిగా రామసుబ్బారెడ్డి చెస్ అభివృద్ధికి చేసిన కృషికి గుర్తింపుగా పదవులు ఇచ్చారని ఆయన చెప్పారు. రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి, గురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డా.దస్తగిరిరెడ్డి, కళారాధన సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు డా.మధుసూదన్‌రావుతో పాటు ఐఎంఏ, నంద్యాల లయన్స్‌క్లబ్ ప్రతినిధులు వారిని అభినందించారు.

అంగన్‌వాడీలపై పనిభారాన్ని తగ్గించాలి

ఆత్మకూరు, అక్టోబరు 9: అంగన్‌వాడీలపై పనిభారాన్ని తగ్గించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు మంజుల, లక్ష్మీదేవీలు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకురాలు విజయలక్ష్మీ, రమాదేవి, స్వప్న, వాణీ, ఓబులమ్మ, కళావతి, ముర్తుజాబీ తదితరులు ఉన్నారు.

దొంగతనాలతో అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్


మాట్లాడుతున్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్

ఆత్మకూరు, అక్టోబరు 9: దొంగతనాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంఅండ్‌ఎం ఫంక్షన్ హాల్‌నందు వివిధ వర్గాల ప్రజలకు దొంగతనాలు, రహదారి జాగ్రత్తలు, సీసీ కెమెరాలు, సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్రమత్తతోనే దొంగతనాలను నిర్మూలించవచ్చునని అన్నారు. ఇళ్ల వదిలి ఊళ్లకు వెళ్లే సమయంలో ఇళ్లలో విలువైన వస్తువులను ఉంచుకోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. అదేవిధంగా వీలైనంత వరకు ఇళ్లలో ఎవరో ఒకరు ఉండేలా శ్రద్ధ వహించాలని చెప్పారు. అదేవిధంగా సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలను నివారించవచ్చునని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సమావేశంలో ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్సై వెంకటనారాయణరెడ్డి ఉన్నారు.

కొలను భారతి ఆలయాభివృద్ధికి కృషి

- నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

కొత్తపల్లి, అక్టోబరు 9: గత వైసీపీ ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం కారణంగానే కొలనుభారతి ఆలయానికి శాపంగా మారిందని, ప్రస్తుతం ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మండలంలోని కొలనుభారతి అమ్మవారిని బుధవారం ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఈవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆలయ పునఃనిర్మాణ పనులు చేపడితే.. నిధులున్నా కూడా గత వైసీపీ ప్రభుత్వం నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడం బాధాకరమన్నారు. కొలనుభారతిలో పురోహితులు, సిబ్బంది మధ్య ఉన్న అంతర్గత కలహాలు ఉండటం వల్ల ఆలయ అభివృద్ధి కుంటుపడిందని ఫిర్యాదులు వస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కొత్తపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం రూ.2.50 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సంగమేశ్వరం నుంచి జానాల గూడెం వరకు రూ.4.50 కోట్ల నిధులతో బీటీ రోడ్డు, రూ.55 లక్షలతో విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే సంగమేశ్వరం వద్ద త్వరలోనే టూరిజం కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కొలనుభారతి ఆలయంపై ఇక నుంచి ప్రత్యేక దృష్టి సారించి రెగ్యులర్ ఈవోను నియమించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, ఆలయ చైర్మన్ వెంకటనాయుడు, మండల కన్వీనర్లు నారపురెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు, స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, నాయకులు బుచ్చిరెడ్డి, నాగేశ్వరరావు యాదవ్, జడ్.వెంకటరెడ్డి, జానాల సుధాకర్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

- దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూలనక్షత్రాన్ని పురస్కరించుకుని ఏడవ రోజు బుధవారం కొలనుభారతి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి మోహన్ పర్యవేక్షణలో జరిగిన ఉత్సవాలకు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 3వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే 240 మంది చిన్నారులకు కూడా వారి తల్లిదండ్రులు అక్షరాభ్యాస, బీజాక్షర క్రతువులు చేయించుకోగా.. దర్శనం, అక్షరాభ్యాస టికెట్ల ద్వారా ఆలయానికి రూ.67,500లు ఆదాయం లభించినట్లు దేవాదాయ శాఖ అధికారి రామసుబ్బయ్య తెలిపారు. విచ్చేసిన భక్తులకు స్థానిక ఆర్యవైశ్య సత్ర నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.
- దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని బుధవారం కొలనుభారతి సరస్వతి అమ్మవారిని కాకనూరు శారదమఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామీజీ దర్శించుకున్నారు.

జన్‌మన్ గృహ నిర్మాణాలపై సర్వే చేపట్టండి

- శ్రీశైలం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సురేష్‌కుమార్



మాట్లాడుతున్న శ్రీశైలం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సురేష్‌కుమార్

ఆత్మకూరు, అక్టోబరు 9: ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద చెంచు గిరిజన లబ్ధిదారులకు మంజూరైన గృహనిర్మాణాలకు సంబంధించిన లోటుపాట్లపై పకడ్బందీ సర్వే చేపట్టాలని శ్రీశైలం ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవో సురేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు, బండిఆత్మకూరు, మహానంది, పగిడ్యాల, ఆళ్లగడ్డ, పాణ్యం, రుద్రవరం, చాగలమర్రి మండలాల తహసీల్దార్లు, గృహనిర్మాణ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పీఎం జన్‌మన్ పథకం కింద నంద్యాల జిల్లా పరిధిలోని చెంచు గిరిజనులకు 508 గృహాలను మంజూరు చేసినట్లు చెప్పారు. ఒక్కో గృహానికి ప్రభుత్వం రూ.2.39లక్షల సహకారాన్ని అందించనున్నట్లు వివరించారు. ఆయా గృహాలకు సంబంధించి ఇళ్ల స్థలాలు సమస్య, మౌలిక సదుపాయాలు వంటి వాటిపై సమగ్ర సర్వే చేపట్టి ఈ నెల 20వ తేదిలోగా నివేదిక అందజేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ వెంకట సుబ్బయ్య, ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక, డీఈ వర్మ, హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరెడ్డి ఉన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

కలెక్టర్, ఎస్పీలను కలిసిన సుబ్బారెడ్డి


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సుబ్బారెడ్డి

డోన్, అక్టోబరు 9: రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి బుధవారం కలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. నంద్యాలలోని కలెక్టర్ చాంబరులో కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి జిల్లాలో విత్తనాలకు సంబంధించిన అంశాలపై సుబ్బారెడ్డి చర్చించారు. అదే విధంగా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాను మర్యాదపూర్వకంగా సుబ్బారెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భూమా విఖ్యాత రెడ్డిలను ఆళ్లగడ్డలోని ఎమ్మెల్యే నివాసంలో సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ జిల్లా మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానన్నారు.

పెళ్లి కానుక పంపిణీ


పెళ్లి కానుకను పంపిణీ చేస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 9: నవవధువు కుటుంబీకులకు పెళ్లికానుకలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి బుధవారం పున: ప్రారంభించారు. గతంలో ఎన్నికల కోడ్ దృష్ట్యా పెళ్లికానుల పంపిణీ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. అయితే ఎన్నికలు అయిపోవడం వివాహాల సీజన్ తిరిగి ప్రారంభం కావడంతో మళ్లీ పెళ్లి కానుకలను నవవధువుకు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. బుధవారం సౌదరదిన్నె గ్రామానికి చెందిన మస్తాన్‌బీ, హుసేన్‌బాబు దంపతులకు పెళ్లికానుక కిట్ పంపిణీ చేశారు. బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ తన తల్లిదండ్రులు దివంగత బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మమ్మల జ్ఞాపకార్థం నియోజకవర్గంలో నవ వధువుకు పెళ్లి కానుక పంపిణీ చేసినట్లు తెలిపారు.

అహోబిలంలో శరన్నవరాత్రి వేడుకలు


ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 9 : అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ ముఖద్వారా మండపంలో కొలువుదీర్చి పంచామృతాలతో అభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. అమృతవల్లి అమ్మవారిని విశేషంగా అలంకరించి పల్లకిలో కొలువుంచి తిరువీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలన్, మణియార్ సౌమ్య నారాయణన్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి.

ఘనంగా అమ్మవారికి బిందె సేవ


బిందె సేవ చేస్తున్న ఆర్యవైశ్య యువకులు

చాగలమర్రి, అక్టోబరు 9: దసరా ఉత్సవాల్లో భాగంగా ముత్యాలపాడు, చాగలమర్రి గ్రామాల్లో బుధవారం అమ్మవారి బిందె సేవ ఉత్సవా న్ని ఘనంగా నిర్వహించారు. వెండిబిందెపై అమ్మవారిని కొలువు దీరింప చేసి పెళ్లి కానీ యువకులచే గ్రామోత్సవం పురవీధుల గుండా నిర్వహించారు. ఆలయాల అధ్యక్షుడు లక్ష్మణ బాబు, నరసింహారావు, ఆర్యవైశ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బిందెసేవ కార్యక్రమం బుధవారం సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహానికి బిందెలతో ఆర్యవైశ్యులు నీరు పోసి మొక్కులను చెల్లించుకున్నారు.

'పల్లె పండుగ'ను విజయవంతం చేయండి

కోవెలకుంట్ల, అక్టోబరు 9: ఈ నెల 14 నుంచి 20 వరకు గ్రామ పంచాయతీలో నిర్వహించే పల్లెపండగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఈపీఆర్ చెంచయ్య, ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర ప్రసాద్ మాట్లాడుతూ రాష్టవ్యాప్తంగా పంచాయతీ రాజ్ మంత్రి ఆదేశాల మేరకు ఆగస్టు 23న అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి పనులు గుర్తించి వాటికి సబంధించి ఎస్టిమేషన్ తయారు చేసి పంపించినట్లు తెలిపారు.

ఉయ్యాలవాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె పండుగలను విజయవంతం చేయాలని ఎంపీడీవో ఉమమహేశ్వరరావు పిపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ ద్వారా మండలానికి రూ. 1.93 కోట్ల నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో చేపడుతున్న పనులకు భూమి పూజ చేస్తామన్నారు.

రుద్రవరం: మండలంలో ఈ నెల 14 నుంచి 18 వరకు పల్లెపండగ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి బుధవారం తెలిపారు. 14న కోటకొండ, చిలకలూరు, 15న పేరూరు, చందలూరు, ముత్తలూరు, 16న ఆలమూరు, చిత్తరేణిపల్లె, టి. లింగందిన్నె, 17న , రామాపురం, ఎర్రగుడిదిన్నె, తిప్పారెడ్డిపల్లె, 18న రుద్రవరం, తువ్వపల్లె గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

శిల్పా వెంచర్ పరిశీలన

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 9 : పట్టణ పరిధిలోని శిల్పా వెంచర్‌ను జేసీ విష్ణు చరణ్ బుధవారం పరిశీలించారు. పంట కాల్వల దారి మళ్లింపుపై కేసీ కెనాల్ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని పంట కాల్వల కొలతలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆర్డీవో మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఈఈ ప్రతాప్ పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 9: పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని టీబీ రోడ్డులో నిర్మించిన అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. పేదలకు అల్పాహారం వడ్డించడంతో పాటు వారితోనే కలిసి ఆమె అల్పాహారం తిన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్లను మూసివేయించిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించి ఇది ప్రజా ప్రభుత్వమని చాటి చెప్పిందన్నారు. రాష్ట్రంలో అధిక శాతం వైసీపీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం నిధులు కేటాయించకపోగా కేంద్రం నుంచి వచ్చిన నిధులను కాజేసి పంచాయతీ వ్యవస్థను భ్రష్టు పట్టించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ రామలింగారెడ్డి, వైస్ ఛైర్మన్ నాయబ్ రసూల్, కౌన్సిలర్ హుసేన్ బాషా, టీడీపీ నాయకులు శేఖర్‌రెడ్డి, బద్రి సుధాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

మద్యం టెండర్ల గడువు పొడిగింపు


సంజామలతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ

సంజామల, అక్టోబరు 9: ప్రైవేటు మద్యం షాపుల టెండర్లకు గడువు పొడిగించినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ సీకాబాషా తెలిపారు. బుధవారం సంజామల పోలీసు స్టేషన్‌లో టెండర్లపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మద్యం షాపు టెండర్లకు ఈ నెల 11న సాయంత్రం 7గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 14న లాటరీ పద్ధతి ద్వారా ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 16న దుకాణాలు ప్రారంభించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్.ఐ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం: రాష్ట ప్రభుత్వం మద్యందుకాణాల గడువు పెంచినట్లు ఎక్సైజ్ సీఐ క్రిష్ణమూర్తి అన్నారు. బుధవారం రుద్రవరం పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మద్యంషాపుల కోసం ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గతంలో 9వతేదీ వరకు గడువు ఉండగా ప్రస్తుతం 11 వరకు దరఖాస్తులు ఆహ్వానానికి గడువు పెంచిందన్నారు. 14న లాటరీ పద్దతిలో మద్యంషాపులు ఎంపిక చేస్తామన్నారు. ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసులు, ఎఎస్ఐ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: రాష్ట్రప్రభుత్వం నూతన మద్యంపాలసీ విధానం ప్రవేశ పెట్టిందని షాపులు పొందడానికి గడవు ఈనెల 9తో ముగుస్తుందని, అయితే 11 వరకు పొడిగించినట్లు కోవెలకుంట్ల ఎక్సైజ్ సీఐ టక్కీ బాషా అన్నారు. బుధవారం కోవెలకుంట్ల సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ కోవెలకుంట్ల సర్కిల్ స్టేషన్ పరిధిలో కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాలు ఉన్నాయనన్నారు. ఈ మండలాలకు సంబంధించి మొత్తం 11 మద్యం షాపులు నిర్వహించుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కొలిమిగుండ్ల: మండలంలో మూడు షాపులకు సంబంధించి 14 దరఖాస్తులు వచ్చాయని సీఐ వర్ధనాదేవి తెలిపారు. గడువు తేదీ ప్రభుత్వం పెంచిందని, వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బేతంచెర్ల: మద్యం దుకాణాల టెండర్లకు ఈ నెల 11 వరకు గడువు పొడిగించారని డోన్ ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి బుధవారం తెలిపారు. బేతంచెర్ల మండలంలో 7 మద్యం దుకాణాలకు మొత్తం 29 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

వైసీపీ హత్యా రాజకీయాలను సహించం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్


మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

డోన్, అక్టోబరు 9: శ్రీకాకుళం జిల్లాలో టీడీపీ నాయకులు వీరస్వామిపై వైసీపీ గూండాలు దాడి చేసి హత్య చేయడం చాలా దారుణమని, ఇలాంటి హత్యారాజకీయాలను సహించే ప్రసక్తే లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరావు యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ యాదవ్ నివాసంలో వై. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో వైసీపీ ప్రభుత్వం హత్యా రాజకీయాలతో టీడీపీ నాయకులను, కార్యకర్తలను, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. వైసీపీ అరాచకాలపై విసుగు చెందే ప్రజలు ఘోరంగా ఆ పార్టీని ఓడిం చారని అన్నారు. వలసల రామకృష్ణ మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని ఢిల్లీలో ధర్నా చేస్తాడని, అసలు హత్యా రాజకీయాలను ప్రోత్సహి స్తున్నది వైసీపీ నాయకులే అని మండిపడ్డారు. ఈసమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, మిద్దెపల్లి గోవిందు, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, జయరాముడు, వలసల సుధాకర్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

చాగలమర్రి, అక్టోబరు 9: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నంద్యాల జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆళ్లగడ్డ టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. చాగలమర్రి జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 53వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ సీనియర్ చాంపియన్‌షిప్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, నంద్యాల బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, పాఠశాల కమిటీ ఛైర్మన్ గౌస్‌మోహిద్దిన్, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, మౌలాలి, అనిఫ్, జెట్టి నాగరాజు, సమిద్దిన్, గఫార్, మహబూబ్‌బాషా, మాబులాల్, భాస్కర్ రెడ్డి, అబ్దుల్లా, అవుల ప్రతాప్, సుబ్బారావు, సురేష్, ఫరూక్, రాజేష్, బషీర్, పీడీలు దాదాపీర్, షేక్షావలి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శులు శ్రీనివాసులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సంక్షేమానికి కృషి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 9: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గొర్రెల, మేకల పెంపకందార్ల సంక్షేమానికి కృషి చేస్తానని ఆ సంఘం వైస్ ఛైర్మన్ శూలం బాల గుర్రప్ప యాదవ్ తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల, మేకల పెంపకందార్ల ప్రాథమిక సహకార సంఘం ఎన్నికలు కర్నూలులో ఏకగ్రీవంగా ముగిసాయన్నారు. రాష్ట్ర గొర్రెల పెంపకందారుల సమాఖ్య మాజీ ఛైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామానికి చెందిన శూలం బాల గుర్రప్ప యాదవ్‌ను ఉమ్మడి జిల్లా వైస్ ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. దీంతో బాల గుర్రప్ప యాదవ్ పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

బేతంచెర్ల, అక్టోబరు 9: గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు మెరుగైన వైద్యం అందించాలని నంద్యాల డీఎంహెచ్‌వో వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల, అక్టోబరు 9: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో గురువారం ఉదయం 10 గంటల నుంచి 12 వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు తిరుపతయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిపో పరిధిలో ఏవైనా సమస్యలుంటే 9959225795 అనే నెంబరుకు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సింహ వాహనంపై వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

బేతంచెర్ల, అక్టోబరు 9: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని భైరిపేటలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం వేంకటేశ్వరస్వామిని సింహ వాహనంపై ఊరేగించారు. స్వామివారికి ఇవీ సుజాతశర్మ, విశ్వనాథరెడ్డి, శ్రీధర్ రెడ్డి, వీరారెడ్డి, నాగేశ్వరరెడ్డి ఆలయ భక్తబృందం సభ్యులు పాల్గొని పూజలు చేశారు.

'తప్పుడు కేసుపై న్యాయ పోరాటం'

డోన్(రూరల్), అక్టోబరు 9: తనపై పెట్టిన తప్పుడు కేసుపై న్యాయ పోరాటం చేస్తానని డోన్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీశెట్టి కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని డోన్ బార్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయవాది కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ డోన్ పట్టణ సీఐ తనపై తప్పుడు కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఈ కేసుపై హైకోర్టులో స్టే విధించిందని అన్నారు. అలాగే డోన్ పట్టణ సీఐపై డోన్ కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు చేశామన్నారు. తనపై నమోదు చేసిన తప్పుడు కేసుపై న్యాయ పోరాటం చేస్తామన్నారు.

గ్రామ పంచాయతీ ఈవోగా సతీశ్‌రెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 9: బనగానపల్లె గ్రామ పంచాయతీ ఈవోగా సతీశ్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో, బనగానపల్లె పట్టణ ప్రజల సహకారంతో బనగానపల్లె పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

దొర్నిపాడు, అక్టోబరు 9: మండలంలోని చాకరాజువేముల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మల్లేశ్వరచౌదరిని బుధవారం ఆళ్లగడ్డ టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు భూమా బ్రహ్మానందరెడ్డిలు పరామర్శించారు. టీడీపీ నాయకుడు మల్లేశ్వర చౌదరి గత కొద్ది రోజుల కిందట హైదరాబాదులో మోకాలి ఆపరేషన్ చేయించుకోవడంతో ఆయన ఆరోగ్యం గురించి భూమా జగత్ విఖ్యాతరెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట భూమా సందిప్‌రెడ్డి, భూమా ప్రతాప్‌రెడ్డి, లింగుట్ల వెంకట్‌నాయుడు, లింగుట్ల రమణయ్య, ఎందూరి మహేష్, గోపాల్‌నాయుడు, నారాయణస్వామి, అమరేశ్వరయాదవ్, బాల నరసింహుడు, డీలర్ మునయ్య, జిల్లా సుబ్బన్న, సర్పంచ్ ప్రభాకర్, భూషిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

చేగువేరాకు ఘన నివాళి


డోన్‌లో చేగువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

డోన్(రూరల్), అక్టోబరు 9: ప్రపంచ విప్లవకారుడు చేగువేరా వర్ధంతిని పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు నక్కి లెనిన్‌బాబు, రణత్ యాదవ్, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగనాయుడు, రాధాకృష్ణ, సుంకయ్య, సూర్యప్రతాప్ పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో చేగువేరా వర్ధంతిని ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిచారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, సహాయ కార్యదర్శి తిరుమలేష్ పాల్గొన్నారు. చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 9: ఆళ్లగడ్డ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో తేజేశ్వరి బుధవారం తెలిపారు. నల్లగట్ల-1(బీసీ-డీ), గుంప్రమాన్‌దిన్నె-2(బీసీ-ఏ), యర్రగుడిదిన్నె(ఓసీ)లో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మండలాల్లోని గ్రామాల్లో 16 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులు ఉన్నాయన్నారు. అర్హులు, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో సూచించారు.

అవుకు: అవుకు మండలం కొండమనాయునిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివమ్మ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ స్థానిక గ్రామానికి చెందిన మహిళలు 10వతరగతి ఉత్తీర్ణత చెంది, 21 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి బీసీ - బీ కులానికి చెందిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలగిన మహిళలు ఈనెల 21తేదీ లోపు దరఖాస్తులను బనగానపల్లె ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయంలో అందించాలని తెలిపారు.

డోన్(రూరల్): డోన్ ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా (హెల్పర్ల)పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్‌బేగం తెలిపారు. డోన్ పట్టణంలో రెండు, చిన్నమల్కాపురంలో ఒకటి, రామదుర్గంలో ఒకటి, బలపాలపల్లె, బేతంచెర్ల ఒక్కొక్కటి , గోరుమా నుతాండలో ఒకటి, నల్లమేకలపల్లిలో ఒకటిగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో తెలిపారు.

కేజీబీవీల్లో..

ఉయ్యాలవాడ: మండలంలోని పుచ్చకాయలపల్లె గ్రామంలో ఉన్న కస్తూర్బా బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఆరు పోస్టులకు అర్హులైన మహిళల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో ప్రతాప్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఒక హెడ్‌కుక్, నాలుగు అసిస్టెంట్ కుక్ పోస్టులతో పాటు ఒక స్కావెంజర్ పోస్టు ఖాళీగా ఉందన్నారు. వంటలో అనుభవం ఉండి అర్హులైన వారు ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాన్ని ఉయ్యాలవాడలోని ఎంఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్లలోని కేజీబీవీలో వంట సహాయకురాలు, నైట్ వాచ్‌మెన్, స్వీపర్, చౌకీదారు పోస్టులకు అర్హతగల వారు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం బుధవారం తెలిపారు. కొలిమిగుండ్ల మండలం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విభాగా లకు చెందిన 18నుండి 42సంవత్సరాల లోపు మహిళలు దరఖాస్తు చేసుకో వచ్చని తెలిపారు. వాచ్‌మెన్‌కు 7వ తరగతి పాసై ఉండాలని, ఇతర పోస్టులకు విద్యార్హత లేదని అన్నారు. 15 ఉదయం 11గంటల లోపు దరఖాస్తులు అందిం చాలని తెలిపారు. వంట సహాయకురాలు-3, వాచ్‌మెన్-1, స్వీపరు-1, చౌకీ దారు-1 మొత్తం 6 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

రుద్రవరం: రుద్రవరం కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయంలో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌ఛార్జ్ ఎంఈవో కోటయ్య బుధవారం తెలిపారు. పాఠశాలలో పొరుగు సేవల ప్రాతిపదికన 2024-25 విద్యాసంవత్సరానికి బోధనేతర సిబ్బందికి పోస్టులు భర్తీ చేయడానికి దరఖాస్తులను ఈ నెల 7 నుంచి 15వరకు స్వీకరిస్తామన్నారు. అసిస్టెంటు కుక్, స్కావెంజర్, స్వీపర్, హెడ్‌కుక్, చౌకిదారు నాన్‌టీచింగ్ సిబ్బంది పోస్టులకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వయసుప పరిమితి ఓసీకి 42, బీసీ ఎస్సీ ఎస్టీ ఈడబ్ల్యూఎస్ 47 సంవత్సరాల వరకు దివ్యాంగులకు 52 సం వత్సరాల వరకు మినహాయింపు ప్రభుత్వం కల్పించింది.

చంద్రబాబుతోనే బీసీల అభివృద్ధి

చాగలమర్రి, అక్టోబరు 9: సీఎం చంద్రబాబుతోనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. బుధవారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో బీసీ కార్పొరేషన్ పైసా నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రామతీర్థం, వీరయ్య, సుబ్బరాయుడు, పుల్లయ్య, సిద్ధప్ప, లాలయ్య, పిచ్చయ్య, చిన్నికృష్ణయ్య, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

'దసరా కానుకగా పీఆర్సీ ప్రకటించాలి'

కోవెలకుంట్ల, అక్టోబరు 9: దసరా కానుకగా గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో 12వ పీఆర్సీ ప్రకటించి ఉద్యోగ ఉపాధ్యాయులకు తీపి కబురు పంపించాలని ఆర్‌జేయూపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, రాష్ట్ర అధికార ప్రతినిధి వీరబ్రహ్మం కోరారు. బుధవారం వారు మా ట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేసి సముచిత రీతిలో ఐఆర్ మధ్యంతర భృతి మంజూరు చే యాలని కోరారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

చాగలమర్రి, అక్టోబరు 9: సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో రంగనేతాజీ తెలిపారు. బుధవారం మండలంలోని మద్దూరు, గొట్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, మినుము పంటల్లో ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణ గురించి తెలియజేశారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

చాగలమర్రి, అక్టోబరు 9: చాగలమర్రి పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 9, 10 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ సీనియర్ విభాగం పోటీలో పాల్గొనే నంద్యాల జిల్లా జట్టు క్రీడాకారులకు దాత ఫ్రూట్‌మర్చట్ మహబూబ్‌బాషా బుధవారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. పాఠశాల కమిటీ ఛైర్మన్ గౌస్ మోహిద్దిన్, క్రీడా దుస్తుల దాత మహబూబ్‌బాషాలను అభినందించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మహబూబ్‌బాషా, పీడీలు దాదాపీర్, షేక్షావలి, కార్యదర్శి మహబూబ్ బాషా పాల్గొన్నారు.

డోన్ డీఎస్పీకి సన్మానం

డోన్(రూరల్), అక్టోబరు 9: డోన్ డీఎస్పీ శ్రీనివాసులుకు మాదిగ రిజర్వే షన్ పోరాట సాధన సమితి నాయకులు బుధవారం సత్కరించారు. ఎమ్మా ర్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల రమేష్ ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రీనివాసులును కలిసి శాలువలతో సత్కరించారు.

కుష్ఠు ప్రాణాంతక వ్యాధి కాదు

చాగలమర్రి, అక్టోబరు 9: కుష్ఠు ప్రాణాంతకమైన వ్యాధి కాదని వైద్యులు అంజలి అన్నారు. బుధవారం చాగలమర్రి గ్రామంలో కుష్ఠువ్యాధి ఉన్న వ్యక్తులకు పాదరక్షలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఏఎన్ఎంలు భూదేవి, రమా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం

చాగలమర్రి, అక్టోబరు 9: చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వేద పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో గణపతి, చండీ హోమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉభయదారులచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారికి మహన్యాస రుద్రాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ


కొలిమిగుండ్ల, అక్టోబరు 9: మండలంలోని కోటపాడు గ్రామంలో వీరభద్రస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ వేడుకలు బుధవారం వైభవంగా నిర్వ హించారు. దాతల సహకారంతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్ది శ్రీవీరభద్ర స్వామి, ధ్వజస్తంభ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబో తుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పలు వురు వైసీపీ నాయకులు పూజలు నిర్వహించారు.


సరస్వతీ దేవిగా అమ్మవారు

దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఏడో రోజు బుధవారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


సంజామల, ముత్యాలపాడు, బేతంచెర్లలో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు


శిరివెళ్లలో.. | అవుకులో.. | తిమ్మనాయినిపేటలో..


ఉయ్యాలవాడలో.. | దొర్నిపాడులో.. | రుద్రవరంలో..


కోవెలకుంట్లలో.. | నందవరంలో కాళరాత్రి అలంకారంలో అమ్మవారు | ప్యాపిలిలో లక్ష్మీదేవిగా..